కనుమరుగు కానున్న

ఎస్‌పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం

రూ. 40.32 కోట్లతో వెయ్యి పడకల హాస్టళ్ల నిర్మాణం



ఒక పక్క పిల్లల ఆటలు, మరోపక్క వెబ్ సిరీస్ షూటింగ్‌తో కళకళలాడుతున్న ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం

బోరబండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, వివిధ ఉత్సవాల నిర్వహణకు వేదికగా నిలిచిన ఎస్‌పీఆర్ హిల్స్‌లోని క్రీడా ప్రాంగణం త్వరలో కనుమరుగు కానుంది. లోయగా మారిన ప్రాంతాన్ని దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చొరవతో మట్టి, నిర్మాణ వ్యర్థాలతో పూడ్చి క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాంగణంలో క్రీడా పోటీలు, బతుకమ్మ వేడుకలు, క్రిస్మస్ ఉత్సవాలు, ముగ్గుల పోటీలు, రంజాన్, బక్రీద్ సామూహిక ప్రార్థనలు చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, వ్యాయామం వంటివన్నీ గత వైభవం కానున్నాయి. మహిళా, శిశు, సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు మురిగి పోకుండా ఈ ప్రాంగణంలో మహిళల కోసం హాస్టళ్ల నిర్మాణాలు చేపట్టనుండడమే దీనికి కారణం.

500 పడకల రెండు హాస్టళ్లు

ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం ఉన్నచోట మహిళాభి వృద్ధి శిశు సంక్షేమ శాఖ తరఫున 500 పడకల రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.20.16 కోట్ల చొప్పున మొత్తం రూ.40.32 కోట్ల కేంద్రం నిధులతో 500 పడకల రెండు హాస్టళ్లను రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు ఆ శాఖ సిబ్బంది ఒకరు తెలిపారు. రెవెన్యూ శాఖ కేటాయించిన 2.75 ఎకరాల్లో ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 పేరుతో హాస్టళ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. హాస్టళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు క్రీడా ప్రాంగణంలో గుంతను తవ్వినట్లు వెల్లడించి గుంత విషయంలో నెల కొన్న సందిగ్ధానికి తెరదించారు.



ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

క్రీడా ప్రాంగణం ఉండాలి



ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం అలాగే ఉంచాలి. అనేక కార్యక్రమాలకు వేదికగా, ఉచితంగా లభించే ఇటువంటి ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేదు. ఏ నిర్మాణాలు చేపట్టినా క్రీడా ప్రాంగణాన్ని వదిలి జరిపితే బాగుంటుంది.

డి.జె.రాజేశ్

క్రీడా ప్రాంగణాన్ని కొనసాగించాలి

పేద, బడుగు వర్గాలకు చెందిన ప్రజలు నివసించే ప్రాంతంలో అభివృద్ధి చేసిన క్రీడా ప్రాంగణాన్ని అలాగే కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఆటాపాటలు, వ్యాయామంతోపాటు వ్యాహ్యాళికి ఈ ప్రాంగణం ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు. బతుకమ్మ వేడుకలు, సంక్రాంతి ముగ్గుల పోటీలు, గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు, రంజాన్, బక్రీద్ సామూహిక ప్రార్థనలు, టోర్నమెంట్‌లకు ఈ ప్రాంగణం వేదికగా నిలుస్తుందని అంటున్నారు. తమ ప్రాంతంలోని క్రీడా ప్రాంగణం అలాగే కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు పవన్, రామ్ చరణ్, అర్జున్, ఆయుష్ విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల విద్యాశాఖకూ మూడెకరాల స్థలం

ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం ఉన్న చోట పాఠశాల విద్యాశాఖకు మూడెకరాలు, మహిళా, శిశు, సంక్షేమ శాఖకు మరో మూడెకరాల స్థలం కేటాయించినట్లు ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్ వెల్లడించారు. 15 ఏళ్ల క్రితం సుందరీకరణ చేసేందుకుగాను 9ఎకరాల 12 గుంటల క్వారీ స్థలాన్ని జీహెచ్ఎంసీకి బదలాయించినట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో సుందరీకరణ జరగక పోగా గుళ్లు, గోపురాలు, దర్గాలు, చిల్లాల ఏర్పాటుతో పాటు కబ్జాలు జరిగినట్లు తెలిపారు. 58,59 జీవోల కింద కొంతమంది రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారని చెప్పారు. అందుకే పాఠశాల విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖకు చెరో మూడెకరాల చొప్పున కేటాయించినట్లు ఆయన వివరించారు.

ప్రేమ్‌కుమార్, తహసీల్దార్

బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రభుత్వ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న రోహిణి

యూసుఫ్‌గూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన హనుమాన్ వ్యాయామ పాఠశాల కింగ్ కోఠిలో శుక్రవారం జరిగింది. ఈ ప్రదర్శనలో యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి ఎన్‌సీసీ విద్యార్థి పి.వరుణ్ భూకంపాలు వచ్చే ముందు సిగ్నల్స్ శబ్దాలను తెలిపే పరికరాన్ని తయారు చేసి ప్రథమ బహుమతి సాధించాడు. హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి సర్టిఫికెట్, బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాలలో హెచ్ఎం పరమేశ్వరమ్మ, ఉపాధ్యాయులు వాత్సవ మాధవీలత, లలిత, శ్రీనివాసన్, ప్రమీల, శాంతి పాల్గొన్నారు.



దీక్షా దివస్‌లో భాగంగా ఏడవ రోజు తెలంగాణ ఉద్యమ దృశ్యాలను గుర్తు చేసుకుంటూ నిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, అబ్దుల్ ముఖిత్ చందా, పురుషోత్తం తదితరులు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ బేగంపేట డివిజన్ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్ ముదిరాజ్

● బేగంపేట, ఆంధ్రజ్యోతి



ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో తవ్విన గుంతను మూసివేయిస్తున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

క్రీడా ప్రాంగణంలో తవ్విన గుంత మూసివేత

బోరబండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో తవ్విన గుంతను శుక్రవారం మూసివేశారు. స్థానికంగా కలకలం రేపిన ఈ గుంత విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి ఎక్స్‌కవేటర్‌తో పూడ్చి వేయించారు. ఎవరికీ ఎటువంటి సమాచారం లేకుండా క్రీడా ప్రాంగణం నడిబొడ్డున ఐదడుగుల గుంతను తవ్విన విషయం తమకు తెలియదంటే తమకు తెలియదని ఇటు ప్రజాప్రతినిధులు, అటు వివిధ శాఖల అధికారులు చెప్పడం విస్మయానికి గురిచేస్తోందని పలువురు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో ఏఈఈ భరత్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకన్య కంఫర్ట్ ఇన్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

పంజాగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ చౌరస్తాలోని శ్రీకన్య కంఫర్ట్ ఇన్ హోటల్‌లో శుక్రవారం రాత్రి స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. పొగ వ్యాపించడంతో ముందు జాగ్రత్త చర్యగా వినియోగదారులు, కిందనే ఉన్న నగల దుకాణంలోని వారిని పోలీసులు బయటకు పంపించారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట నుంచి బేగంపేట వైపు వెళ్లే మార్గం సోమాజిగూడ చౌరస్తా సమీపంలోని బహుళ అంతస్థుల భవనం నాలుగు, ఐదు అంతస్తుల్లో శ్రీకన్య కంఫర్ట్ ఇన్ పేరుతో హోటల్ నడుస్తోంది. ఎప్పుడూ హోటల్ రద్దీగా ఉంటుంది. శుక్రవారం రాత్రి వంట గదిలోని చిమ్నీలో నుంచి పొగలు, మంట రావడం గమనించారు. వెంటనే సిబ్బంది తమ వద్ద ఉన్న పరికరాలతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. పొగ హోటల్ మొత్తం వ్యాపించడంతో ముందు జాగ్రత్తగా వినియోగదారులతోపాటు కిందనే ఉన్న నగల దుకాణంలోని వారిని బయటకు పంపించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు పూర్తిగా ఆపారు. చిమ్నీలో వ్యర్థాలు పేరుకుపోవడంతోనే పొగ, మంట వచ్చిందని గుర్తించి, అప్పటికప్పుడు చిమ్నీని శుభ్రం చేయించారు. ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఏసీపీ సంజయ్ కుమార్

ఖైరతాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తగా ఉంటే ఎవరూ మోసం చేయలేరనే విషయాన్ని అందరూ గుర్తించి సెల్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో సిబ్బందికి, ఖాతా దారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలతో మోసపోయిన పలువురి ఉదాహరణలు చెప్పి జాగ్రత్తలు వివరించారు. పోలీసు శాఖ ముద్రించిన కరపత్రాలను చూపించి నేరగాళ్లు సెల్‌ఫోన్‌ల ద్వారానే మోసాలకు గురిచేస్తారని, గుర్తు తెలియని వారు ఫోన్ చేసి ఆఫర్లు ఇచ్చినా, మెసేజ్‌లు పెట్టి ఆకర్షణలకు గురి చేసినా స్పందించకపోవడం మంచిదని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే సైబర్ సెక్యూరిటీ వారిని సంప్రదించి ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10వ తేదీ నుంచి జాగృతి జనంబాట

బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన జాగృతి జనంబాట కార్యక్రమం ఉంటుందని జాగృతి జిల్లా అధ్యక్షుడు బండారి మహేందర్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆయన జాగృతి జిల్లా కమిటీ నేతలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 15 నియోజకవర్గాల్లో జాగృతి జనంబాట కార్యక్రమంలో కవిత పాల్గొని స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జాగృతి నేతలు ఎల్.రూప్‌సింగ్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నరేందర్, ధరణి, కావూరి వెంకటేష్, రాధాకృష్ణ, మనోజ్, శ్రీను, ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం వృద్ధుడికి బెదిరింపులు

బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కొందరు వ్యక్తులు బెదిరిస్తున్నారని, అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని ఓ వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ కృష్ణా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న జంషీద్ బర్నీ అనే వృద్ధుడు అతడి సోదరుడు నవీద్ బర్నీకి కలిసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14లో ఓ ఇల్లు ఉంది. మహ్మద్ అజీజ్ ఖాన్, మహ్మద్ తమ్జీద్ ఖాన్, మహ్మద్ రంజాన్ ఖాన్, రాంచందర్, లక్ష్మీబాయి తదితరులు నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తిని తమ అధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వృద్ధుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాజాగా ఇంటి ప్రహరీని కూల్చడంతో పాటు నేమ్‌బోర్డులు తొలగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

గచ్చిబౌలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ పోలీస్ బెటాలియన్ సిబ్బంది కోసం ప్రతి నెలా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమాండెంట్ రామకృష్ణ సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో బెటాలిన్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తానని, నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణానగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.250 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌లను కలిసి అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్, సంఘం గౌరవ అధ్యక్షుడు మామిడాల రాజు, అధ్యక్షుడు బుడుగు రవి, ప్రధాన కార్యదర్శి సతీష్, సంఘం సభ్యులు శివకుమార్, పెరుక రవి, ప్రభాకర్, యశ్వంత్, సంపత్ పాల్గొన్నారు. కాగా, ఎర్రగడ్డకు చెందిన పలువురికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను యూసుఫ్‌గూడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ మేళా ఎగ్జిబిషన్

● మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ప్రారంభం



ఎగ్జిబిషన్‌లోని వస్తువులను తిలకిస్తున్న సందర్శకులు



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సుధారాణి, సీతారామయ్య తదితరులు

ఎర్రగడ్డ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లోని కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ సేల్ ప్రారంభమైంది. మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఉపాధ్యక్షురాలు పి.సుధారాణి, కార్యదర్శి బి.సీతారామయ్య ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకంగా ఈ ఎగ్జిబిషన్‌లో హస్తకళలతో రూపొందించిన వస్తువులను, వస్త్రాలను పొందుపరచడం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తుందన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు అక్బర్ అలీ, గంగాధర్, షబ్బీర్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో పొందుపరిచిన ప్రతీ వస్తువు, వస్త్రాలు అన్నీ హస్తకళలతో ప్రత్యేకంగా రూపొందించినవేనని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తయారు చేసిన వాటిని ఇక్కడ ఉంచడం జరిగిందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు, స్థానిక నాయకులు పీఏఎస్ మూర్తి, ఆర్.శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఎస్.అంజిరెడ్డి, తులసీదాస్, కె.రుక్మిణి పాల్గొన్నారు.

వాయు నాణ్యత పెంపునకు సమన్వయంతో పనిచేయాలి

● అదనపు కమిషనర్ రఘుప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రఘుప్రసాద్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాయు నాణ్యత పెంచేందుకు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (పారిశుధ్యం) రఘుప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం(ఎన్‌సీఏపీ) కింద నగరస్థాయి వాతావరణ పర్యవేక్షణ మరియు అమలు కమిటీ శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమావేశమైంది. గ్రేటర్‌లో హాట్ స్పాట్ల డేటా సమీక్ష, సిటీ యాక్షన్ ప్లాన్ పురోగతి-పరిశీలన, సూక్ష్మస్థాయి వ్యూహాలు, రోడ్డుపై దుమ్మూధూళి తగ్గింపు, వాహన ఉద్గారాల నియంత్రణ, పరిశ్రమల కాలుష్య నియంత్రణ, నిర్మాణ రంగ వ్యర్థాల సమర్థ నిర్వహణ, పచ్చదనం విస్తరణ, ప్రధాన నిర్మాణ ప్రదేశాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రధాన హాట్ స్పాట్లలో తక్షణ, దీర్ఘకాలిక నియంత్రణ చర్యలు అవసరమని సమావేశంలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పంజాగుట్ట-పటాన్‌చెరు కారిడార్, చార్మినార్-నాంపల్లి హెరిటేజ్ జోన్, హైటెక్ సిటీ ట్రాన్సిట్ కారిడార్, ఎంజీబీఎస్-సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ల వద్ద పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. వాయు కాలుష్యం తగ్గించేందుకు ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెంచేలా చూడాలని, పెట్రోల్, డీజిల్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ రంగ వ్యర్థాల తరలింపునకు పౌరులు 1800 120 1159, 1800 203 0033 టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

● తాత అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



వీధి కుక్కను నిరోధిస్తున్న తాత

యూసుఫ్‌గూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని పిల్లలపై వీధి కుక్కల దాడులు రోజురోజుకూ పెరుగుతోన్నాయి. మొన్న హయత్‌నగర్ వీరన్నగుట్టలో మూగ బాలుడిపై దాడి చేసిన వీధి కుక్క సంఘటన మరువక ముందే యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహ నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. బాలుడి కేకలు విన్న తాత వెంటనే అప్రమత్తమై దాడి చేస్తున్న కుక్కను నిరోధించాడు.

రెండేళ్ల ఎం.మన్విక్ నందన్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే గల్లీలో సంచరిస్తున్న పిచ్చికుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. బాలుడి కేకలు విన్న తాత కర్రతో దాడి చేస్తున్న కుక్కను నిరోధించాడు. బాలుడి తల్లి బయటకు వచ్చి భయాందోళనకు గురవుతూ బాలుడిని అక్కున చేర్చుకుంది. ఎడమ చేయిపై పడిన కుక్క కాటుకు ప్రాథమిక చికిత్స చేయించారు. శుక్రవారం ఉదయం సమీపంలోని సలీం అనే వ్యక్తి పెంచుకుంటున్న పిల్లిని ఇదే కుక్క కరిచి చంపింది. బాలుడిపై పిచ్చి కుక్క దాడిని సీసీ టీవీలో పరిశీలించి సలీం కుటుంబసభ్యులు సోషల్ మీడియా గ్రూపులలో పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, ఇదే పిచ్చి కుక్క గురువారం రాత్రి కృష్ణానగర్ బోరింగ్ గల్లీలో ఇద్దరు మహిళలపై దాడి చేసి గాయపరిచిందని స్థానికులు చెబుతున్నారు. బాలుడి కుటుంబసభ్యులు, స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చి కుక్కను వెతికి పట్టుకొని తీసుకెళ్లారు.



కుక్కను పట్టుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

నిమ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన నరేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృద్ధుల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలోని 34 ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీరియాట్రిక్ కేర్ సర్వీసులను జనవరి 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారని చెప్పారు. ఒక్కో ఆస్పత్రిలో 20 బెడ్లతో సీనియర్ సిటిజన్లకు వైద్య సదుపాయం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఒక్కో ఆస్పత్రిలో న్యూట్రిషనిస్టు, ఫిజియోథెరపిస్ట్, ఫిజీషియన్, సైకాలజికల్ కౌన్సిలర్, డెంటల్, ఆప్తమాలజీ వైద్యులను అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు.



సదస్సు ప్రారంభంలో డీఎంఈ నరేంద్రకుమార్, డాక్టర్ వైఎస్ఎన్ రాజు, క్రిస్టినా జెడ్ చోంగ్తు, డాక్టర్ బీరప్ప

జీడియాట్రిక్ కేర్ సర్వీసుపై వైద్యులకు శిక్షణ

నిమ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధుల కోసం ప్రారంభించనున్న జీడియాట్రిక్ కేర్ సర్వీసుపై ప్రభుత్వ సూపరింటెండెంట్‌లు, ఇన్‌చార్జీలకు శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలోని ట్రామా ఆడిటోరియంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య, వైద్య సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, డీఎంఈ నరేంద్రకుమార్ హాజరయ్యారు. జనవరిలో ప్రారంభం కానున్న జీడియాట్రిక్ కేర్ సర్వీసుపై విభాగాధిపతి డాక్టర్ వైఎస్ఎన్ రాజు అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ ఇప్పటికే నిమ్స్‌లో జీడియాట్రిక్ కేర్ సర్వీసు అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో డైటీషియన్ షాలిని, హెల్పేజ్ ఇండియా జేడీ వి.యతీంద్ర, ఆర్ఎంవో డాక్టర్ రేణుపూజిత పాల్గొన్నారు.



వయోవృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

వయో వృద్ధులకు రగ్గుల పంపిణీ

అమీర్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా సంఘ సేవకుడు శ్రీధర్‌రావు అందజేసిన రగ్గులను మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి 200 మంది వయోవృద్ధులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెగాసిటీ మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కూతురు నర్సింహ, కట్టా బలరాం, లక్ష్మి పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

అమీర్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, నవుడురాకు చెందిన సుశాంత్(20) ఎల్లారెడ్డిగూడలోని బాబాయి వద్ద ఉంటూ 10వ తరగతి పూర్తి చేశాడు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. ఎల్లారెడ్డిగూడలో ఇల్లు ఇరుకుగా ఉండడంతో ఈనెల 3న అమీర్‌పేటకు మకాం మర్చారు. ఈ నేపథ్యంలో అమీర్‌పేట మెట్రో స్టేషన్ వరకు వచ్చిన సుశాంత్ కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బోయినపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు రక్షణశాఖ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం బోర్డు అధికారులు నేలమట్టం చేశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణశాఖ బంగ్లా బీ-3 క్యాటగిరీకి చెందిన బంగ్లాల్లో కొన్ని కోర్టు వివాదంలో ఉన్నాయి. వాటిలో ఒకటి బంగ్లా నంబర్ 207/ఏను సురేందర్ భాటియా పేరుతో లీజుకు తీసుకుని ఈ స్థలంలో సుమారు 30 సంవత్సరాలుగా అక్రమ నిర్మాణాలు చేపట్టి లక్షల రూపాయలకు అద్దెకు ఇచ్చారు. ముఖ్యంగా ఈ స్థలంలో వ్యాపారాలు చేయరాదని తెలిసినా సదరు వ్యక్తి అక్రమ నిర్మాణాలతో పాటు, వ్యాపారాలకు అద్దెకు ఇచ్చి నడిపిస్తున్నాడు. గతంలో పలుమార్లు బోర్డు అధికారులు బంగ్లా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ సీఈఓ అరవింద్ ద్వివేది ఆదేశాల మేరకు కూల్చివేతలను ప్రారంభించి అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసినట్లు బోర్డు అధికారి దేవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు అధికారులు ఫణి కుమార్, ఉమా శంకర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్పీఎఫ్ పోలీస్ కంట్రోల్ కేంద్రంలో శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్‌తో పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసింది. అదేవిధంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో పేలుడు పదార్థాలు ఉన్నాయా లేవా అనే కోణంలో తనిఖీలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నామని ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.



సర్వే చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

అడ్డగుట్టలో ఓటర్ కార్డుల సర్వే

అడ్డగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లోని పలు బస్తీల్లో ఓటర్ కార్డుల మ్యాపింగ్ సర్వే జరుగుతుందని జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్, తుకారాంగేట్ అడ్డగుట్టలో పర్యటిస్తున్నామని ఓటర్ కార్డు లేని వాళ్లకు ఓటుహక్కు కల్పించేలా నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లు కృష్ణ, సతీష్, సిద్ధిఖ్, రిసోర్స్ పర్సన్లు రెహానా, రజిత, ప్రేమలు పాల్గొన్నారు.



బస్టాపు ప్రారంభం

లోతుకుంట సత్య పెట్రోల్ పంప్ వద్ద నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్‌లు కొత్త బస్టాపును ప్రారంభించారు. కార్యక్రమంలో పాటు బస్ డిపో మేనేజర్, ఆర్టీసీ స్టాఫ్ పాల్గొన్నారు.

\- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న రాగీరు ఆనంద్‌బాబుగౌడ్

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

సికింద్రాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఆవులమంద లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. పడి పూజ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన కలశాభిషేక పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబుగౌడ్ హాజరై అయ్యప్పస్వామికి పూజలు జరిపారు.



పడిపూజ

బోయినపల్లి కృష్ణారెడ్డి కాలనీలో శశి గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అయ్యప్పస్వామి 14వ పడిపూజకు కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, టెంట్ రాజు తదితరులు హాజరై, పూజలు జరిపారు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్శల్ ఆఫీస్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉండటంతో స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. మార్కెట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు వచ్చి వ్యక్తి పరీక్షించిన అనంతరం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

కనుమరుగు కానున్న

ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం

రూ.40.32 కోట్లతో వెయ్యి పడకల హాస్టళ్ల నిర్మాణం



ఒక పక్క, పిల్లల ఆటలు, మరోపక్క, వెబ్ సిరీస్ షూటింగ్‌తో కళకళలాడుతున్న ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం

బోరబండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, వివిధ ఉత్సవాల నిర్వహణకు వేదికగా నిలిచిన ఎస్పీఆర్ హిల్స్‌లోని క్రీడా ప్రాంగణం త్వరలో కనుమరుగు కానుంది. లోయగా మారిన ప్రాంతాన్ని దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చొరవతో మట్టి, నిర్మాణ వ్యర్థాలతో పూడ్చి క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాంగణంలో క్రీడా పోటీలు, బతుకమ్మ వేడుకలు, క్రిస్మస్ ఉత్సవాలు, ముగ్గుల పోటీలు, రంజాన్, బక్రీద్ సామూహిక ప్రార్థనలు చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, వ్యాయామం వంటివన్నీ గత వైభవం కానున్నాయి. మహిళా, శిశు, సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు మురిగి పోకుండా ఈ ప్రాంగణంలో మహిళల కోసం హాస్టళ్ల నిర్మాణాలు చేపట్టనుండడమే దీనికి కారణం.

500 పడకల రెండు హాస్టళ్లు

ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం ఉన్నచోట మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తరఫున 500 పడకల రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.20.16 కోట్ల చొప్పున మొత్తం రూ.40.32 కోట్ల కేంద్రం నిధులతో 500 పడకల రెండు హాస్టళ్లను రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు ఆ శాఖ సిబ్బంది ఒకరు తెలిపారు. రెవెన్యూ శాఖ కేటాయించిన 2.75 ఎకరాల్లో ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 పేరుతో హాస్టళ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. హాస్టళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు క్రీడా ప్రాంగణంలో గుంతను తవ్వినట్లు వెల్లడించి గుంత విషయంలో నెల కొన్న సందిగ్ధానికి తెరదించారు.



ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

క్రీడా ప్రాంగణం ఉండాలి



ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం అలాగే ఉంచాలి. అనేక కార్యక్రమాలకు వేదికగా, ఉచితంగా లభించే ఇటువంటి ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేదు. ఏ నిర్మాణాలు చేపట్టినా క్రీడా ప్రాంగణాన్ని వదిలి జరిపితే బాగుంటుంది.

డి.జె.రాజేశ్

క్రీడా ప్రాంగణాన్ని కొనసాగించాలి

పేద, బడుగు వర్గాలకు చెందిన ప్రజలు నివసించే ప్రాంతంలో అభివృద్ధి చేసిన క్రీడా ప్రాంగణాన్ని అలాగే కొనసాగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఆటాపాటలు, వ్యాయామంతోపాటు వ్యాహ్యాళికి ఈ ప్రాంగణం ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు. బతుకమ్మ వేడుకలు, సంక్రాంతి ముగ్గుల పోటీలు, గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు, రంజాన్, బక్రీద్ సామూహిక ప్రార్థనలు, టోర్నమెంట్‌లకు ఈ ప్రాంగణం వేదికగా నిలుస్తుందని అంటున్నారు. తమ ప్రాంతంలోని క్రీడా ప్రాంగణం అలాగే కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు పవన్, రామ్ చరణ్, అర్జున్, ఆయుష్ విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల విద్యాశాఖకూ మూడెకరాల స్థలం

ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణం ఉన్న చోట పాఠశాల విద్యాశాఖకు మూడెకరాలు, మహిళా, శిశు, సంక్షేమ శాఖకు మరో మూడెకరాల స్థలం కేటాయించినట్లు ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్ వెల్లడించారు. 15 ఏళ్ల క్రితం సుందరీకరణ చేసేందుకుగాను 9ఎకరాల 12 గుంటల క్వారీ స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి బదలాయించినట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో సుందరీకరణ జరగక పోగా గుళ్లు, గోపురాలు, దర్గాలు, చిల్లాల ఏర్పాటుతో పాటు కబ్జాలు జరిగినట్లు తెలిపారు. 58,59 జీవోల కింద కొంతమంది రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారని చెప్పారు. అందుకే పాఠశాల విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖకు చెరో మూడెకరాల చొప్పున కేటాయించినట్లు ఆయన వివరించారు.

ప్రేమ్‌కుమార్, తహసీల్దార్

గౌడ సంఘంలో నిధుల దుర్వినియోగం జరగలేదు

సంఘం మాజీ కోశాధికారి పి.లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.జయహరి

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జమిస్తాన్‌పూర్ గౌడ సంఘంలో నిధుల దుర్వినియోగం జరిగిందని సంఘం మాజీ అధ్యక్షుడు శిరీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్‌లు చేసిన ఆరోపణల్లో నిజం లేదని సంఘం మాజీ కోశాధికారి పి.లక్ష్మణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.జయహరి, సభ్యులు పి.వెంకటేష్‌గౌడ్, బి.భిక్షపతిగౌడ్‌లు పేర్కొన్నారు. గౌడ సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై 2021 నవంబర్ 2న జరిగిన గౌడ సంఘం సమావేశంలో సంఘానికి సంబంధించి మొత్తం రూ.39లక్షలలో ఖర్చులు పోను మిగిలిన రూ.14లక్షలను సంఘం సభ్యులు ఏర్పాటుచేసుకున్న 9మందితో ఏర్పడిన కమిటీ సభ్యులకు అదే రోజున అప్పగించడం జరిగిందన్నారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో నూతన కమిటీ ఎన్నుకోబడిందని, ఆ కమిటీ చట్టప్రకారంగా సభ్యులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పాల్గొని గెలిచే సత్తా లేని శిరీష్‌గౌడ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్‌లు తమపై తప్పుడు ప్రచారం చేసి సంఘం సభ్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 2021లో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమావేశంలో వీరిద్దరూ పాల్గొని తీర్మానాల పత్రాలపై సంతకాలు చేసిన విషయాన్ని మరచిపోయి మాట్లాడడం సబబు కాదన్నారు. వారిద్దరూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్న కాలంలో సంఘానికి సంబంధించిన దాదాపు రూ.19లక్షలను ముషీరాబాద్ సెంట్రల్ బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం జరిగిందన్నారు. ఆ ఎఫ్‌డీలను వెంటనే నూతన కమిటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. శిరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉన్న సంఘానికి సంబంధించిన మూడు మడిగెలను కొత్త కమిటీకి అప్పగించి సొసైటీ సభ్యులకు సహకరించాలని కోరారు. మరొక సారి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, భిక్షపతి తదితరులు

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

ముషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూతనివ్వాలని డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్‌లోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ స్వరూపరాణి భవిత కేంద్రానికి సౌండ్ సిస్టంను తన సొంత డబ్బులతో అందజేశారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో చేరిన దివ్యాంగ బాలురకు రూ.5వేలు, బాలికలకు రూ.7వేలు ప్రతిఏటా పిల్లల తల్లిదండ్రుల అకౌంట్లలో వేస్తారని అన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ కనీస్ ఫాతీమా, ఐఈఆర్‌పీలు మల్లేష్‌గౌడ్, విజయ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన గండికోట కుమార్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

వడ్డెర సొసైటీ అధ్యక్షుడి ఎన్నిక

తార్నాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షుడుగా గండికోట కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం మాణికేశ్వర్‌నగర్‌లో సమావేశమైన సొసైటీ సభ్యులు అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేశారు. ఉపాధ్యక్షుడుగా జి. కిరణ్, జనరల్ సెక్రటరీగా జి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గండికోట కుమార్ మాట్లాడుతూ సొసైటీ సభ్యులు తనపై ఉన్న నమ్మకంతో వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సింధీ కాలనీ పరిసరాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో జార్ఖండ్‌కు చెందిన సోను యాదవ్ వద్ద 1.10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. తనకు గంజాయి సేవించే అలవాటు ఉండటంతో తాను వినియోగించుకునేందుకు గంజాయి తెచ్చుకున్నానని సోను యాదవ్ విచారణలో వెల్లడించాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

- సివిల్స్ ఉచిత శిక్షణలో ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదవి ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్‌రెడ్డి సివిల్స్ అభ్యర్థులకు సూచించారు. ఓయూలోని సివిల్ సర్వీస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ గ్రూప్స్ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని పెట్టుబడిగా పెట్టి నిరంతరం శ్రమిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమానికి 800 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓయూ పీఎస్ పరిధిలో మరింత భద్రతకు ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో వీధిదీపాలు, చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి ఓయూ సీఐ అప్పలనాయుడు శుక్రవారం డిప్యూటీ మేయర్‌ను తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓయూ పీఎస్ పరిధిలో భద్రత కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించేందుకు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా ఓయూ పీఎస్‌లో వీధి దీపాలు, చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.



డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఓయూ సీఐ అప్పలనాయుడు తదితరులు

పత్తి విత్తన చట్టాన్ని ఆమోదించడానికి ప్రభుత్వం కుట్ర

- రైతుకూలీ సంఘం నేతలు

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో 2025 పత్తి విత్తన చట్టాన్ని ఆమోదించడానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందంలు ఆరోపించారు. పత్తి విత్తన చట్టం కార్పొరేట్ సంస్థలకు లాభం, రైతులకు నష్టం కలిగించేదే అని విమర్శించారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మో దీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ సంస్థలైన మోనోశాంటో, సిజెం టా, టాటా తదితర ప్రవేశం వల్ల కల్తీ విత్తనాలు పెరిగిపోయాయన్నారు. దీంతో రైతులు నేటికీ కల్తీ విత్తనాల తయారీదారులపై ఎలాంటి చర్యలు తీ సుకోకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. 2025 పత్తి విత్తన చట్టం, విద్యుత్ బిల్లుల సవరణ కు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యం లో ఈనెల 8న ఆ చట్టం ప్రతుల దహన కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి జి. వెంకటేశ్వర్‌రావు, నాయకులు యుగేంధర్, బి.సత్తన్న, బో నాల స్వామి, చంద్రం, రామచంద్రన్న పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మారేడుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని బీజేపీ పార్టీ మహిళా మోర్చా నాయకురాళ్లు మాలతి, మాధవి తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని అన్నారు. పాత, కొత్త నాయకులు ఐక్యమత్యంతో కలిసి పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



సంఘీభావం తెలుపుతున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

బీసీ నాయకులకు సంఘీభావం

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిన కాంగ్రెస్ ప్రార్టీ వైఖరిని నిరసిస్తూ పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని సాయి ఈశ్వర్ మృతి చెందాడు. దీంతో ప్రభుత్వ వైఖరికి నిరసనగా గాంధీ ఆస్పత్రి వద్ద బైఠాయించిన బీసీ నాయకులను అరెస్ట్ చేసి రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అరెస్ట్ అయిన బీసీ నాయకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ జాతి కళ్లు తెరవడానికి తన ప్రాణాలు అర్పించి బీసీ ఉద్యమంలో మొదటి అమరవీరుడు సాయి ఈశ్వర్ చారి అని కొనియాడారు. అరెస్ట్ అయిన వారిలో బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, కుందారం గణేష్ చారి, సుదగాని హరి శంకర్, బత్తుల సిద్దేశ్వర్, మణిమంజరి, తెలంగాణ శ్యామ్‌లతో పాటు పలువురు బీసీ నాయకులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు కృష్ణ గోపాల్, అజయ్ శేషరావు, సెంటర్ హెడ్ కృష్ణవేణి

ఆహారం మింగలేక మహిళ అవస్థ

అరుదైన వైద్య ప్రక్రియ నిర్వహించిన వైద్యులు

ఆధునిక పెర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటమీతో చికిత్స

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అకలేషియా కార్డియా వ్యాధితో బాధపడుతున్న 61 ఏళ్ల మహిళకు ఎండో స్కోపిక్ మయోటమీ చికిత్స చేసిన సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు నూతన జీవితాన్ని ప్రసాదించారు. ఆ వివరాలను శుక్రవారం విలేకరుల సమావేశంలో మెడికవర్ హాస్పిటల్ సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ బండారి తెలిపారు. నగరానికి చెందిన కృష్ణవేణి(61) ఆహారం మింగడానికి, కనీసం పెటి ద్వారా ద్రవ పదార్థాలు కూడ తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దాంతో మహిళ మెడికవర్ వైద్యులను సంప్రదించగా, అకలేషియా కార్డియా వ్యాధిగా గుర్తించాం. ఈ సమస్య నివారణకు రోగికి పెర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటమీ(పీఓఇఎం) వైద్య ప్రక్రియ నిర్వహించినట్లు చెప్పారు. అన్నావాహిక నాళం గట్టిగా మారడం వల్ల ఆహారం మింగడంలో ఇబ్బంది ఏర్పడి, అది గొంతు వరకు వెళ్లి ఆగిపోతుందని, తినలేకపోవడం వల్ల బరువు తగ్గడం, పోషక లోపం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అజయ్ శేషరావ్ షిండే, సెంటర్ హెడ్ కృష్ణవేణి పాల్గొన్నారు.

జీవితాలకు మార్గం చూపిన వృత్తిని మరువం

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ,అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నామని 2014 బ్యాచ్ కానిస్టేబుల్స్ తెలిపారు. పోలీస్ శాఖలో 11 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 2014 బ్యాచ్ కానిస్టేబుల్స్ శుక్రవారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మంది కానిస్టేబుళ్ల కేక్ కట్ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందడం ద్వారా తమ జీవితాలకు మార్గం ఏర్పడిందని అన్నారు.